

మక్సీమ్ గోర్కీ

గుండె కాగడా





మక్సీమ్ గోర్కీ (1868 - 1936)

అనిల్

మక్సీమ్ గోర్కీ

గుండె కాగడా


రష్యన్ నుంచి ఇంగ్లిష్ : మార్గరెట్ వెట్లిన్


బొమ్మలు : వి. కె. బిసెంగలియెవ్

ఇంగ్లిష్ నుంచి తెలుగు : ఎన్. వేణుగోపాల్





అనగనగనగా ఎప్పుడో పురాతన కాలపు కథ ఇది.
మూడువైపులా చుట్టుకున్న చిక్కని కారడవి. చీమలు
కూడా దూరలేని అడవి. ఒక్కవైపు మాత్రం విశాలమైన
పచ్చిక మైదానం. ఆ గడ్డినేల మీద ఉండేది ఒకానొక తెగ.
ఆ సమూహంలోని ప్రజలు మహా బలవంతులు.
ధైర్యసాహసాలు నిండిన మనుషులు.
వాళ్ళ ముఖాలమీద ఎల్లప్పుడూ చిరునవ్వులు
వెలుగుతుండేవి.





కానైతే కొంతకాలానికి వాళ్ళకు కానికాలం వచ్చి పడింది. చెప్పరాని చిక్కులొచ్చాయి. వేరే తెగల వాళ్ళు వాళ్ళమీద యుద్ధానికొచ్చారు. ఆ పచ్చిక మైదానం నుంచి వాళ్ళను అడవి లోలోపలికి తరిమేశారు, తోసేశారు.






మరి ఆ అడవి నిండా చిమ్మచీకటి. అదంతా బురద నిండిన ఊబి నేల. భూమి పుట్టిన దగ్గరినుంచీ ఆ అడవి ఉంది. అక్కడ చెట్ల కొమ్మలు చిక్కుముడులలాగా అల్లుకుపోయాయి. ఆ చెట్ల కింది నుంచి చూస్తే అసలు ఆకాశమే కనబడదు. సూర్యకిరణాలు చొరబారవు. ఆ బురద నీళ్ళ మీద ప్రతిఫలించాలంటే సూర్యరశ్మికి చాలా కష్టం. మందపు ఆకుపచ్చని తెరల్ని అటూ ఇటూ జరుపుకుంటూ సందుచేసుకుని కిందికి దూరి రావాలి. అడవిలో ఎక్కడెక్కడ నీళ్ళ తావులు కనిపెడితే అక్కడల్లా విషపు పొగలు వాళ్ళను చుట్టుముట్టాయి. వాళ్ళు జబ్బుల బారిన పడ్డారు. చచ్చిపోయారు.




ఆ తెగలోని ఆడవాళ్ళూ, పిల్లలూ అంతులేని శోకాలు పెట్టారు. ఎందుకిలా జరిగిందా అని మగవాళ్ళు ఆలోచనలో పడ్డారు. విచారంలో మునిగిపోయారు. ఈ అడవిలోంచి బయటపడడం తప్ప మరో మార్గమేమీ కనిపించలేదు వాళ్ళకు. కానీ, బయటికి పోవడానికి కూడా రెండే దారులున్నాయి. ఒకటి వాళ్ళు ఏ దారిన పడి ఈ అడవిలోకి వచ్చారో ఆ దారే పట్టుకుని వెనక్కి వెళ్ళడం. కానీ, ఆ దారిన వెళితే వాళ్ళను తరిమేసిన శత్రువులున్నారు. బలవంతులూ, దుష్టులూ అయిన శత్రువులు. ఇక మరొకదారి అడవిలో ముందుకు దూసుకుపోవడమే. కానీ, ఈ దారిలో మరింత దట్టమైన, మరింత బలమైన వృక్షాలున్నాయి. వాటి కొమ్మలు చిక్కగా అల్లుకుని ఉన్నాయి. వాటి వేళ్ళు మెలికలు తిరిగి బురదనేలలోకి చొచ్చుకుపోయి ఉన్నాయి. నిజం చెప్పాలంటే ఆ చెట్లు బండరాళ్ళలా ఉన్నాయి. నిశ్శబ్దంగా, నిశ్చలంగా నిలబడి ఉన్నాయి. అది పట్టపగలే ఐనా బూడిదరంగులో మసక మసకగా నిరాశాపూరితంగా ఉంది. రాత్రుళ్ళలో ఆ మనుషులందరూ నెగళ్ళు వేసుకుని కూచున్నప్పుడు ఆ చెట్లు వాళ్ళను మింగెయ్యడానికి చూస్తున్న అడవి మృగాల్లా కనబడతాయి. పచ్చిక మైదానపు స్వేచ్ఛలో పుట్టిపెరిగిన ఆ తెగకు రాత్రీ పగలూ ఒకే తీరుగా చుట్టూ గోడ కట్టినట్టుగా నిలిచిన నీడలు, వాళ్ళను మట్టిలోకి తొక్కెయ్యబోతున్నట్టున్న నీడలు. అన్నిటికన్నా భయం గొలిపేది గాలి. అది చెట్ల చిటారు కొమ్మల మీదుగా ఏడుస్తూ వీస్తుంటుంది. దానితో మొత్తం అడవి అడవంతా ఆ బందీల కోసం విషాదగీతం పాడుతున్నట్టు వినిపిస్తుంది.



ఆ తెగ మనుషులు చాల ధైర్యవంతులని ముందే చెప్పాను కదా. తమను ఓడించినవాళ్ళను ఎదిరించి చావునైనా ధిక్కరించి పోరాడగలిగే మనుషులు వాళ్ళు. కానీ, అలాంటి యుద్ధమే చేస్తే అసలు తమ ఆనవాలు లేకుండా పోతుందని భయపడ్డారు. వాళ్ళేమో వాళ్ళ పూర్వీకుల ఆదేశాల్ని ముందుకు తీసుకుపోవలసి ఉంది. మరి తామే మట్టి కలిసిపోతే తమ ఆశయాలు అంతమైపోతాయి. ఈ ఆలోచన వాళ్ళను నిలవనివ్వలేదు. ఉన్నచోట ఉండనివ్వలేదు. ఎడతెగని రాత్రులలో చుట్టూ విషపు పొగలు చిమ్ముతుంటే, అడవి అడవంతా విషాద గీతాలు పాడుతుంటే వాళ్ళు తమ విధిని తలచుకుంటూ దీర్ఘాలోచనలలో మునిగిపోయేవాళ్ళు. అలా వాళ్ళు విచారంగా కూచుని ఉన్నప్పుడు నెగళ్ళ మంటల నీడలు వాళ్ళచుట్టూ సవ్వడి లేకుండా నాట్యం చేస్తుండేవి. అక్కడ నాట్యమాడుతున్నవి నీడలు మాత్రమే కాదనీ, అవి విజయోత్సవం జరుపుకుంటున్న దయ్యాలనీ అనిపించేది వాళ్ళకు. అవి అడవి దయ్యాలు. అవి బురదగుంటల దయ్యాలు. అక్కడ ఆ మగవాళ్ళందరూ విచారపు ఆలోచనలో నిరాశగా కూచుని ఉండేవాళ్ళు. మనిషికి విచారాన్ని మించిన అలసట మరేదీ లేదు. అలా విచారంతో వాళ్ళు ఇంకా బలహీనులయిపోయారు. వాళ్ళ హృదయాలలో భయం మొలకెత్తింది. శక్తివంతమైన వాళ్ళ చేతులను భయం కట్టేసింది. విషపు పొగలతో చచ్చిపోయిన తమ మగవాళ్ళను చూసి ఆడవాళ్ళు ఏడుస్తుంటే వాళ్ళను భయం ముంచెత్తింది. భయంవల్ల నిస్సహాయులైపోయి వాళ్ళు శోకాలు పెడుతుంటే వాళ్ళలో భీతావహం ఇంకా పెరిగిపోయింది. ఇంక ఆ అడవిలో ఎక్కడలేని పిరికి మాటలూ వాళ్ళ పెదాలమీదికి వచ్చాయి. మొదట మెత్తగా, నంగిగా వచ్చిన పిరికి మాటలు కాలం గడిచినకొద్దీ బలం పుంజుకున్నాయి. గొంతు పెంచుకున్నాయి. చివరికి ఆ మనుషులు ఇక శత్రువు దగ్గరికే వెళ్ళిపోదామా అని ఆలోచించారు. తమ స్వేచ్ఛనే కానుకగా చేసి శత్రువుకు సమర్పిద్దామా అనుకున్నారు. చావు సమీపించిందనే ఆలోచనతో వాళ్ళు ఎంతగా భయపడిపోయారంటే, ఒక్కరంటే ఒక్కరు కూడా బానిస బతుకును అసహ్యించుకోలేదు...సరిగ్గా ఆ క్షణాన వచ్చాడొక మనిషి. అతని పేరు దాంకో.





దాంకో వాళ్ళలో వాడే. వాళ్ళ మనిషి. యువకుడు. బలిష్టమైన వాడు. బలంగా ఉండేవాళ్ళెప్పుడూ ధైర్యంగా కూడా ఉంటారుగా. అందుకే దాంకో తన సహచరులతో అన్నాడు:

"ఆలోచిస్తూ కూచుంటే రాళ్ళు కదలవు. ఏమీ చేయనివాడు ఎందుకూ పనికిరాడు. ఆలోచిస్తూ, విచారపడుతూ మనం మన శక్తినంతా ఎందుకు వృథా చేసుకోవాలి? లేవండి, లేచి నడవండి. ఈ అడవిని చీల్చుకుని సాగిపోదాం. ముందుకు పోదాం. మున్ముందుకు పోదాం. అడవి అంతు చూద్దాం. దేనికైనా అంతు ఉంటుంది కదా. అడవికీ అంతు ఉంటుంది. పదండి ముందుకు, పదండి తోసుకు!"

వాళ్ళందరూ దాంకో వేపు చూశారు. తమందరిలోకీ దాంకో గొప్పవాడని గుర్తించారు. అతని కళ్ళలో జీవం వెలుగుతోంది. అతని చూపుల్లో శక్తి తొణికిసలాడుతోంది.

"మరి నడపవయ్యా మమ్మల్ని," అని పిలిచారు వాళ్ళు.

ముందు నడిచాడతను.


వాళ్ళకు నాయకత్వం వహించాడతను.


వాళ్ళందరూ ఇష్టంగా అతణ్ణి అనుసరించారు. వాళ్ళందరూ అతనిలో నమ్మకం ఉంచారు.

అది ఒక కష్టభరితమైన బాట. చుట్టూరా కళ్ళు పొడుచుకున్నా కనబడని చిమ్మచీకటి. అడుగు తీసి అడుగు వేస్తే బుడుంగున మునిగే బురద గుంటలు. చెట్లు కావవి, దారికి అడ్డంగా లేచినిలిచిన అభేద్యమైన గోడలు.

చెట్లకొమ్మలు ఒకదానికొకటి మెలిపడి ఉన్నాయి. వాటి వేళ్ళు ఎటుపడితే అటుతిరిగే పాముల్లా ఉన్నాయి. నడుస్తుంటే మనుషుల ప్రతి అడుగూ రక్తం చిమ్మింది. చెమట కాలవలై పారింది. అయినా వాళ్ళు ఎంతో సేపు నడుస్తూనే ముందుకే సాగారు...

ఇంకా ముందుకు వెళ్ళగా వెళ్ళగా అడవి మరింత చిక్కనయింది. వాళ్ళ కాళ్ళు మరింత బలహీనమయ్యాయి. అప్పుడిక దాంకో మీద అనుమానపు గుసగుసలు మొదలయ్యాయి. కుర్రాడు కదా అన్నారు. అనుభవం లేదు కదా అన్నారు. మనందరినీ నడిపించే అర్హత ఈ కుర్రాడికి ఏముందన్నారు. అతను ఇవేవీ వినిపించుకోకుండా వాళ్ళందరికంటే ముందర నడుస్తూనే పోయాడు. అతని సాహసం చెక్కుచెదరలేదు. అతని మనసు మీద మేఘాలు కమ్మలేదు.





కానీ, ఒక రోజు అడవి మీద తుపాను విరుచుకుపడింది. చెట్లు చీకాకు పరిచేలా ఈలలు వేశాయి. ఒక్కక్షణంలో చిమ్మచీకటి అలముకుంది. ఎంత గాఢమైన చీకటంటే ఆ అడవి పుట్టినప్పటినుంచీ గడిచిన రాత్రులన్నిటి చీకటీ ఆ రాత్రే కుప్పపోసినట్టయింది. అక్కడి మహావృక్షాల కింద ఆ చిన్నారి మనుషులు భయం భయంగా బెరుకు బెరుకుగా నడక సాగించారు. చుట్టూరా తుపాను గర్జన. వాళ్ళు నడుస్తుంటే చెట్లు కిరకిరలాడాయి. పిచ్చి పాటలేవో పాడాయి. చెట్ల చిటారు కొమ్మల మీదినుంచి అప్పుడప్పుడూ మెరుపుల తళుకులు కనిపించాయి. అలా మెరిసినప్పుడు ఆ అడవి మీద చల్లని నీలి కాంతి ఒక లిప్తపాటు పరుచుకున్నట్టు అనిపించింది. ఆ కాంతి ఎంత అనుకోకుండా వచ్చిందో అంతే త్వరగా మాయమయిపోయేది. ఆ మనుషుల గుండెలలో మరింత భయాన్ని నింపిపోయేది. ఆ మెరుపుల చల్లని నీలి కాంతిలో చెట్లు కారుమబ్బుల లాగా, బతికి ఉన్న జంతువుల లాగా, జడల్లా ముడిపడిన తమ కొమ్మలు చాచి వాళ్ళని తమ వలలోకి పిలుచుకుంటున్నట్టు అనిపించేది. చీకటినుంచి పారిపోతున్న మనుషులను తనలోకి రమ్మని పిలుస్తున్నట్టు అనిపించేది. ఆ చీకటి నిండిన ఆకులలోంచి ఏదో చల్లనిదీ, నల్లనిదీ భయపెట్టేదీ తమవంక చూస్తున్నట్టు వారికి అనిపించేది.

అది భయానకమైన, కష్టభరితమైన ప్రయాణం. ఆ ప్రయాణం చేద్దామని బయలుదేరిన మనుషులలో ఓపిక నశించిపోయింది. గుండె జారిపోయింది. కానీ, వాళ్ళకు తమ బలహీనతను ఒప్పుకోడానికి సిగ్గేసింది. అందుకని వాళ్ళు తమ కోపాన్నీ, అసంతృప్తినీ దాంకో మీద గుమ్మరించారు. దాంకో వాళ్ళందరికన్న ముందర నడుస్తున్నాడు. తమకు నాయకత్వం వహించే శక్తి అతనికి లేదని వాళ్ళు దాంకో మీద విరుచుకుపడడం మొదలుపెట్టారు.

వాళ్ళొకచోట ఆగిపోయారు. అలసిపోయారు. కోపావేశపూరితులయ్యారు. చుట్టూరా బాణాల్లా పొడుస్తున్న చీకటి మధ్య, తుపాను పాడుతున్న విజయగర్జన మధ్య వాళ్ళు దాంకోను నిలదీసి, నిందలు వేయడం మొదలుపెట్టారు.

"నువ్వొక అసహ్యకరమైన, దుష్టశక్తివి. నువ్వే మాకీ దుఃఖం కలిగించావు, ఈ కష్టం తెచ్చిపెట్టావు," అన్నారు వాళ్ళు. "మమ్మల్ని ఇక్కడిదాకా తోసుకొచ్చి అలసిపోయేలా చేశావు. నీకిందుకు తగిన శిక్ష పడుతుంది. నీకు నూకలు చెల్లాయి," అన్నారు. వాళ్ళకు జవాబు చెప్పడానికి వెనకకు తిరిగాడు దాంకో. "నడిపించవయ్యా మమ్మల్ని అన్నది మీరే. అందుకే వచ్చాను. అందుకే నాయకత్వం వహించాను," అన్నాడు.


"మిమ్మల్ని నడిపించే ధైర్య సాహసాలు నాకున్నాయి. అందుకే ఆ పనికి పూనుకున్నాను. కాని మీరేం చేశారు? మీకు మీరు చేసుకున్నదేమిటి? నా వెంటపడి నడవడం తప్ప మీరేం చేశారు గనుక? ఇంకా నడవాల్సింది ఎంతో ఉంది. అందుకు మీ శక్తుల్ని కూడగట్టుకోవడానికి మీరేం చేశారు? మీరు చేసినదల్లా గొర్రె మందలా నా వెంట పడి రావడం మాత్రమే కాదూ," అన్నాడు.


ఆ మాటలతో వాళ్ళకు ఇంకా కోపం వచ్చింది.

"నువ్వు నాశనమైపోతావు! నువ్వు పురుగులుపడి పోతావు!" అని శాపనార్థాలు పెట్టారు.

అడవి గర్జించింది. వాళ్ళ కేకలను ప్రతిధ్వనించింది. ఒక విద్యుల్లత మెరిసి చీకటిని ఖండఖండాలుగా చీల్చింది. ఎవరికోసం తాను ఈ బృహత్తర యాత్ర ప్రారంభించాడో ఆ జనసమూహం వైపు తేరిపార చూశాడు దాంకో. వాళ్ళందరూ ఆకలిగొన్న మృగాల్లా కనిపించారు. వాళ్ళందరూ అతణ్ణి చుట్టుముడుతున్నారు. వాళ్ళ ముఖాల్లో మానవత్వ చిహ్నాలేవీ కనిపించలేదు. వాళ్ళు తనపట్ల ఎటువంటి దయా చూపించరని దాంకోకు అర్థమయింది. అతని గుండెల్లో అసంతృప్తి జ్వాల రగిలింది. కానీ వారిపట్ల ఆప్యాయతానురాగాలు ఆ మంటను చల్లార్చాయి. ఈ మనుషులనే కదా తాను ప్రేమించింది అనుకున్నాడు. తాను లేకపోతే వీళ్ళు అంతమైపోతారు కదా అనుకున్నాడు. వారిని రక్షించాలనే గొప్ప ఆకాంక్ష అతని గుండెల్లో పెనుమంటలా విస్తరించింది. వారిని సులభమైన మార్గంలోకి నడిపించాలనే వాంఛ అతనిలో పురి విప్పింది. అతని గుండెల్లో ఎగసిపడుతున్న ఆ వాంఛాజ్వాలలు అతని కళ్ళలో ప్రతిఫలించాయి...ఆ కళ్ళనిండా ఎరుపు చూసి అతనిలో కోపం రగులుతోందని వాళ్ళు అనుకున్నారు. ఆగ్రహావేశజ్వాలల వల్లనే అతని కళ్ళలో ఆ వెలుగు కనబడుతోందని అనుకున్నారు. రెచ్చిపోయారు. తోడేళ్ళలా మారిపోయారు. అతను తనంత తాను తమమీదికి దూకుతాడని ఎదురుచూశారు. అతణ్ణి ఒడిసిపట్టుకుని, చంపి పారెయ్యడానికన్నట్టు ఒకరికొకరు దగ్గరికి వచ్చారు.

వాళ్ళు ఏం ఆలోచిస్తున్నారో దాంకోకు అర్థమయింది. అతని హృదయంలో మంటలు మరింతగా చెలరేగాయి. ఇంకా వెలుగులు చిమ్మాయి. అతని ఆకాంక్షల జ్వాలలకు వాళ్ళ ఆలోచనలే విచారం నిండిన ఆజ్యాన్ని పోశాయి.






అప్పటికీ ఆ అరణ్యం తన విషాదగీతాన్ని పాడుతూనే ఉంది. ఉరుములు ఉరిమాయి. భోరునవర్షం కురవడం మొదలయింది....


'ఈ ప్రజలను రక్షించడానికి నేనింకా ఏం చేయవలసి ఉంది?' దాంకో ప్రశ్న ఉరుముల శబ్దాన్ని మించి వినబడింది.

హఠాత్తుగా అతను తన రొమ్ము చీల్చుకున్నాడు. తన గుండెను చీల్చి బయటికి లాగాడు. తన చేతిలో ఆ గుండెను కాగడాలా పైకి ఎత్తి పట్టుకున్నాడు.


ఆ గుండె సూర్యబింబంలాగా వెలిగిపోయింది. సూర్యుడికన్నా ఎక్కువ వెలుగును విరజిమ్మింది. గర్జిస్తున్న అరణ్యం నిశ్శబ్దమై పోయింది. ఆ కరదీపిక వెలుగులో అడవి అడవంతా వెలుగు నిండింది. అది ప్రజల పట్ల అపారమైన ప్రేమాదరాలకు చిహ్నమైన కాగడా. దాని ముందర చీకటి రద్దయిపోయింది. ముడుచుకుపోతూ దాక్కుంటూ వణికిపోతూ ఆ చీకటి అక్కడ నోరు విప్పుకున్న ఒక ఊబిలోకి దూకి అడవి లోతుల్లో మాయమయిపోయింది.
ఆ జనసమూహమంతా సంభ్రమాశ్చర్యాలతో రాయిలాగా గడ్డకట్టిపోయింది.

"నా వెనక నడవండి..." ఆదేశించాడు దాంకో. మండుతున్న తన గుండెను తల మీద ఎత్తిపట్టుకుని దారిచూపుతూ ముందుకు పరిగెత్తాడు.





ఇక వాళ్ళు మంత్ర ముగ్ధులైనట్టు అతని వెనక నడవడం మొదలుపెట్టారు. మళ్ళీ ఒకసారి అడవి గుసగుసలాడడం మొదలుపెట్టింది. చెట్ల చిటారుకొమ్మలు ఆశ్చర్యంతో తలలూపాయి. ఆ అడవి గుసగుసలు నడుస్తున్న మనుషుల పాదధ్వనుల ముందర మణగిపోయాయి. వాళ్ళు ధైర్యంగా, వేగంగా ముందుకు పరిగెత్తారు. కాగడాలా మండుతున్న గుండె చూపుతున్న అద్భుతమైన వెలుగుతో ఆకర్షితులై ముందుకే సాగారు. ఇప్పుడు కూడా పడిపోయిన వాళ్ళున్నారు, అంతమైపోయిన వాళ్ళున్నారు. కానీ వాళ్ళకు కన్నీళ్ళు లేవు. వాళ్ళకు ఎటువంటి ఫిర్యాదూ లేదు. దాంకో ముందుకే, మున్ముందుకే సాగిపోయాడు. అతని గుండె ఇంకా ఇంకా ఎక్కువగా వెలుగులీనుతూనే ఉంది.







హఠాత్తుగా వాళ్ళముందరి అడవి రెండుగా చీలిపోయింది. వారికి దారి ఇవ్వడానికి చీలిపోయింది. వారి వెనక మూసుకుపోయింది. వెనక చూస్తే నిశ్చలంగా దృఢంగా నిలిచిన గోడ. దాంకో, అతని అనుచరులూ మహాసముద్రం లాంటి సూర్యకాంతిలోకి, వానలో స్నానమాడిన గాలిలోకి ప్రవేశించారు. ఇప్పుడిక తుఫాను వాళ్ళ వెనక అడవి మీదనే ఆగిపోయింది. ఇక్కడ సూర్యుడు జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్నాడు. పచ్చిక మైదానం జీవంతో తొణికిసలాడుతోంది. గడ్డిపరకల మీద వానచినుకులు రత్నాల్లా మెరుస్తున్నాయి. నదిమీద బంగారు తీగలు సాగుతున్నాయి. . . అది ఒక సాయంసంధ్య. అస్తమిస్తున్న సూర్య కిరణాలు నది మీద రక్తారుణిమతో వర్ణచిత్రాన్ని గీశాయి. ఆ నది దాంకో గుండెగాయం నుంచి ప్రవహిస్తున్న కవోష్ణ రుధిర ధార.


సాహసి దాంకో తన చూపులను ఆ విశాలమైన పచ్చిక మైదానం మీద దిగంతం దాకా సారించాడు. తన ప్రియమైన స్వేచ్ఛా భూమిని అనంతానందంతో పరికించి చూశాడు. గర్వసమన్వితమైన మందహాసం చేశాడు. ఒరిగిపోయాడు. ప్రాణాలు వదిలాడు.

అతని అనుచరులు ఎంతగా ఆనందంలో, ఆశలో మునిగిపోయారంటే అతను చనిపోవడం వాళ్ళు చూడనేలేదు. ఆ మృతదేహం పక్కనే ఆ సాహస హృదయం ఇంకా మండుతూనే ఉండింది. ఒక పిరికివాడు అది చూసి, తాను చూసినదేమిటో తెలియక, భయపడిపోయి ఆ మండే గుండెను కాలితో నలిపేశాడు. . . అలా కాలితో తొక్కగానే దానినుంచి వెలుగురవ్వలు విరజిమ్మాయి. ఆ గుండె ఆరిపోయింది.






అందుకే ఆ పచ్చిక మైదానంలో ఎప్పుడూ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడానికి ముందు నీలి రంగు వెలుగురవ్వలు కనిపిస్తూనే ఉంటాయి.







Danko's Burning Heart
by Maxim Gorky
Raduga Publishers, 1983

ప్రచురణ కాలం : నవంబరు, 2010
ప్రతులు : 3000
వెల : **రూ. 35/-**
ప్రచురణ, ప్రతులకు : **మంచి పుస్తకం**
12-13-450, వీధి నెం. 1,
తార్నాక, సికింద్రాబాద్ - 5000017.
ఫోన్ : 94907 46614
email : info@manchipustakam.in
website : www.manchipustakam.in

ISBN 978-93-80153-48-3

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, ఆజామాబాద్,
హైదరాబాద్-500 020. ఫోన్ : 040-27678411